మెటల్ రోడ్లకు మోక్షం

- ఇటీవల మంత్రి దామోదర శంకుస్థాపన
- మెటల్ రోడ్ల నిర్మాణాలకు రూ.4.20 కోట్ల నిధుల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న జనం


మెటల్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ (ఫైల్)

రాయికోడ్(అందోల్): కొన్నేళ్లుగా ఎదురుచూసిన ప్రయాణికులు, రైతులకు మెటల్ రోడ్ల నిర్మాణాలతో ఇబ్బందులు తప్పనున్నాయి. మండల పరిధిలోని ఆరు మార్గాల్లో చేపట్టనున్న పనులకు ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. పనులు పూర్తయితే మండల పరిధిలోని 9 గ్రామాల రైతులు, ప్రయాణికులకు కష్టాలు దూరమవనున్నాయి. సరైన రోడ్లు లేక కొన్నేళ్లుగా రైతులు పంటల సాగు సమయంలో విత్తనాలు, ఎరువుల తరలింపులో, పంట ఉత్పత్తులను పొలాల నుంచి ఇళ్లకు చేర్చడంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో ఆయా మార్గాలు బురదమయంగా మారడంతో కాలినడక తప్పేదికాదు. ఈ క్రమంలో ఇటీవల మెటల్ రోడ్ల నిర్మాణాలకు మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రూ.4.20 కోట్ల నిధుల కేటాయింపు

రాయికోడ్ మండల పరిధిలోని ఆయా గ్రామాలను కలుపుతూ నిర్మించనున్న మెటల్ రోడ్లకు రూ.4.20 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను కేటాయించారు. మండల పరిధిలోని యూసుఫ్‌పూర్–ధర్మాపూర్ మార్గాలకు రూ.50లక్షలు, ధర్మాపూర్–రాయికోడ్ మార్గాలకు 50లక్షలు, అల్లాపూర్–శంశోద్దీన్‌పూర్ మార్గాలకు 60లక్షలు, పీపడ్‌పల్లి–రాయికోడ్ మార్గాలకు రూ.కోటి, కర్చల్–బొగ్గులంపల్లి ప్రాజెక్టు మార్గాలకు 30లక్షలు, రాయికోడ్–చిమ్నాపూర్ మార్గంలో మరో 30లక్షల నిధులను కేటాయించారు. వేగవంతంగా మెటల్ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



మంజూరైన నిధులతో మెటల్ రోడ్ల నిర్మాణాలను త్వరలోనే ప్రారంభిస్తాం. పనులు నాణ్యతగా చేపట్టేందుకు జాగ్రత్తలు తీసుకుంటాం. మూడు లేయర్లుగా రోడ్ల నిర్మాణం ఉంటుంది. నిర్ణీత కాలంలో పనులను పూర్తిచేసి ప్రయాణికులు, రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.
– శశికుమార్, పీఆర్‌ఏఈ, రాయికోడ్

అనుమానాస్పద వ్యక్తులపై దాడి

సంగారెడ్డి టౌన్: భిక్షాటన చేస్తూ అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై దాడి చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి మండల పరిధిలో సదాశివనగర్‌లో ఇద్దరు వ్యక్తులు భిక్షాటన చేస్తూ అనుమానాస్పదంగా కనబడటాన్ని గమనించారు. దీంతో పిల్లలను ఎత్తుకెళ్లడానికి వచ్చారు అనుకొని గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లోత్రే, బాబుతీ పటాన్‌రు మండలంలోని కిష్టారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. అనుమానితులు ఎవరూ కనిపించినా సమాచారం ఇవ్వాలని సూచించారు.

మొక్కులు తీర్చుకున్న బీఆర్‌ఎస్ నాయకులు


శ్రీశైలంలో బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్: పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శ్రీశైలం వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి విజయం సాధిస్తే శ్రీశైలం వచ్చి మొక్కులు చెల్లిస్తామని దేవుడికి మొక్కుకున్నామని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. శ్రీశైలంకు వెళ్లిన వారిలో సూరారం నర్సింలు, రాంచందర్, శ్రీశైలంయాదవ్, దశరథ, గోవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే...

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామ రహదారి గుండా టేక్మాల్, పాపన్నపేట మండలాలకు వెళ్లే రోడ్డు పక్కన ఏర్పడ్డ గొయ్యి ప్రమాదకరంగా మారింది. గతంలో ఇక్కడ కల్వర్టు ఉండేది. అది కాస్త కుడివైపు మట్టితో కూరుకుపోయి, మరో వైపు పెద్దగొయ్యి ఏర్పడింది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచిన ప్రమాద బారిన పడడం ఖాయం. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యి పూడ్చే పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డును ఆనుకొని ఏర్పడ్డ గొయ్యి

బంజారాలు ఐక్యం కావాలి


మాట్లాడుతున్న రామారావు మహారాజ్

కొడిపల్లి(నర్సాపూర్): బంజారాలు ఐక్యంగా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని మహారాష్ట్ర పొరదేవి ఆలయం నుండి వచ్చిన రామారావు మహారాజ్ అన్నారు. గురువారం ఆయన, తన మిత్రుడు నెహ్రూ మహారాజ్‌తో కలసి మండలంలోని పలు గిరిజన తండాలను పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంజారా పద్ధతులు, సంప్రదాయాలు కొనసాగిస్తూనే, అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన జన సమితి నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్ నాయక్, మాజీ జెడ్పీటీసీ దేవులానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కూతురు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కూతురి అదృశంపై తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంకు చెందిన ఫర్హా సుల్తానా పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేస్తోంది. రోజు మాదిరిగానే ఈ నెల 20వ తేదీన ఆఫీస్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఖమ్మంలో ఉండే కుటుంబ సభ్యులు ఫర్హాసుల్తానాకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కంగారుపడిన ఆమె కుటుంబసభ్యులు పరిశ్రమ యజమాన్యంకు ఫోన్ చేయగా గంట ముందుగానే పర్మిషన్ తీసుకుని వెళ్లిందని సమాధానం ఇచ్చారు. దీంతో ఫర్హాసుల్తానా ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కూతురు అదృశ్యంపై తండ్రి ముజీబ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ ఆమదయ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ గ్రామ యూటర్న్ హనుమాన్ ఆలయం పక్కన శ్రీనివాస్ ఆటో మెకానిక్ షాప్ సమీపంలో గతేడాది అక్టోబర్ 10వ తేదీన గుర్తుతెలియని వృద్ధుడిని కొంతమంది లారీలో తీసుకొచ్చి వదిలి వెళ్లారు. అయితే ఆ వృద్ధుడు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో చికిత్స నమిత్తం అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ ఆయిల్ డబ్బాలు స్వాధీనం : ముగ్గురిపై కేసు

పటాన్‌చెరు టౌన్: నకిలీ క్యాస్ట్రాల్ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురిపై అమీన్‌పూర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పట్టణంలోని యూకే ఆటో మొబైల్స్, కిష్టారెడ్డిపేటలోని శ్రీసూర్య ఆటోమొబైల్స్, శ్రీసాయిరాం బైక్ పాయింట్ దుకాణాల్లో పోలీసులు సోదాలు చేయగా క్యాస్ట్రాల్ ఆయిల్ పేర్లతో ఉన్న 29 నకిలీ డబ్బాలను గుర్తించారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా ఆయిల్ డబ్బాలు నకిలీవని తేల్చారు. పై మూడు దుకాణదారులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఆలయ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆలయాల అభివృద్ధికి సహకారం

మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని లింగమయ్య కాలనీలో కౌన్సిలర్ సదువుల మల్లేషం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపనను గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు కృష్ణ, కల్పనా ఉపేందర్‌రెడ్డి, చంద్రకళ గోపాల్, కోఆప్షన్ సభ్యులు రాములు, సీనియర్ నాయకులు రమేశ్‌గౌడ్, యాదగిరి, దాస్‌యాదవ్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


రఫీ(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని హుమ్నాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్ మండల పరిధిలోని మాటూర్ గ్రామానికి చెందిన ఎండీ.రఫీ ఈ నెల 19న ఇంట్లో నుంచి వెళ్లి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రఫీ సోదరుడు మన్సూర్ 21వ తేదీన రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం న్యాల్‌కల్ మండల పరిధిలోని హుమ్నాపూర్ శివారులో దుర్వాసన రావడంతో అటుగా వెళ్లిన స్థానికులకు మృతదేహం పడిఉండగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ నెల 19న తప్పిపోయిన రఫీగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామానాయుడు తెలిపారు.

అంగన్‌వాడీలో నీటి గోస


అంగన్‌వాడీ సెంటర్‌లో భోజనం చేస్తున్న పిల్లలు, తల్లులు

నర్సాపూర్: అంగన్‌వాడీ కేంద్రంలో నీటి సరఫరా సదుపాయం లేక అనేక అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్‌లోని 13వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఉన్నా.. నీటి కోసం నల్లా కనెక్షన్ లేదు. అంగన్‌వాడీ కేంద్రానికి 25 మంది చిన్నారులు చదువుకునేందుకు , 25 మంది తల్లులు రోజూ భోజనానికి వస్తారు. వారందరికీ భోజనం వండేందుకు, పిల్లలు బాత్‌రూం అవసరాలకు నీటిని అంగన్‌వాడీ సెంటర్‌లోని ఆయా వజ్రమణి చుట్టు పక్కల ఉన్న ఇళ్ల నుంచి నీటిని బిందెలతో ఎత్తుకొని వచ్చి అందుబాటులో ఉంచుతుంది. రోజు పది నుంచి పదిహేను బిందెల నీరు అవసరమవుతుందని అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ తెలిపారు. నీటి సమస్యను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ సెంటరులో నీటి నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా నర్సాపూర్‌లోని పలు ఇతర అంగన్‌వాడీ సెంటర్లలో సైతం నీటి సమస్య ఉంది. సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయా భవనాలకు నల్లా కనెక్షన్లు ఉన్నప్పటికీ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేకించి సంపులు లేనందున ఇళ్ల యజమానుల నుంచి నీటిని తీసుకుంటున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ డీఈఈ కిషన్ దృష్టికి తీసుకుపోగా త్వరలో నల్లా కనెక్షన్ ఇస్తామని చెప్పారు.


నీరు మోసుకొస్తున్న ఆయా వజ్రమణి

పనులు పూర్తి చేయండి

నర్సాపూర్: పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం ఆయన పదో వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్‌తో కలిసి పదో వార్డులో పర్యటించారు. సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ఉండాలని సకాలంలో పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ బుచ్చేష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్ బుచ్చేశ్

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కొడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని రాజిపేట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు బాపుశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మంటపారాధన, స్వామి వారికి అభిషేకం, హోమం నిర్వహించారు. వార్షికోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో సీతారాముల కల్యాణం, పల్లకీసేవ ఉంటుందన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ మహీంద్ర కాలనీలో ఉన్న పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 24 నుంచి మార్చి 2వ తేదీ వరకు 22వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఎంపీటీసీ, నాయకులు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండల పరిధిలోని గోటిగార్‌పల్లి గ్రామంలో రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్, ఎంపీటీసీ తుకారాం కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, సిద్దు, తదితరులు పాల్గొన్నారు. సీసీ రోడ్డు ప్రారంభోత్సవంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బెల్టుషాపులను అరికట్టండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఖేడ్ డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం బెల్టుషాపులను అరికట్టాలని కోరుతూ ఖేడ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సిబ్బందికి నియోజకవర్గ సామాజిక హక్కుల సంఘం అధ్యక్షుడు పుప్పాల అశోక్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు భీంసేనా తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్న మద్యం షాపులపై సైతం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ


పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయం శివనామస్మరణతో మారు మోగింది. ఝరాసంగం గ్రామానికి చెందిన శివదీక్షపరుడు ఎంపీ నాగన్న ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో గురువారం శివ పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి శివదీక్ష భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శివుడికి అభిషేకం, మహా మంగళహారతి, తదితర పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

నియామకం


సాయిచరణ్

జహీరాబాద్: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా మాజీ మంత్రి చంద్రశేఖర్ కుమారుడు సాయిచరణ్‌ను నియమించింది. వైస్ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి, సభ్యులుగా నరేష్‌గౌడ్, కిషన్‌రాథోడ్, వంశీ, సుజాత, జాఫర్, బోయిని శేఖర్, అశోక్, అఖీల్ అహ్మద్, సయ్యద్ అంజాద్ మియా, పట్లోళ్ల మల్లారెడ్డి, రాయికోడ్ నర్సింహులు, శంకరప్ప పాటిల్‌లను నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాయిచరణ్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు జహీరాబాద్‌కు మంత్రి దామోదర రాక

జహీరాబాద్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఈ నెల 23న జహీరాబాద్‌కు రానున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ఏరియా ప్రభుత్వాస్పత్రిని సందర్శిస్తారు. ఆతర్వాత ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని పీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

సంక్షిప్త వార్తలు

◆ 29న విజయ సంకల్పయాత్ర

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈ నెల 29 నుంచి మండలంలో నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ సంకల్పయాత్రలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ రేపు ఉపాధి సామాజిక తనిఖీ

పుల్‌కల్(అందోల్): ఈ నెల 24న ఉపాధిహామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆనంద్‌మేరీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పక్షం రోజులుగా గ్రామ స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించామని మండల స్థాయి సదస్సు 24న ఎంపీపీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు హాజరుకావాలని సూచించారు.

◆ దేశభక్తిని పెంపొందించుకోవాలి

నారాయణఖేడ్: నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వామి వివేకానంద లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి అన్నారు. ఖేడ్‌లోని సాయి బాబా ఫంక్షన్‌హాల్‌లో ‘ఖేలో భారత్’ ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఖండకార్యవహ ప్రసాద్, జ్ఞానేశ్వర్, నాగనాథ్‌రావు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాశ్, నాయకులు రాజు, నిఖిల్, వెంకట్, దశరథ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, మాణిక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

◆ పాదయాత్ర

జిన్నారం(పటాన్‌చెరు): అయోధ్యలో రామమందిర నిర్మాణం సందర్భంగా జిన్నారంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామభక్తులు బొంతపల్లిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయానికి పాదయాత్రగా వెళ్లి స్వామివారికి అభిషేకం చేశారు. భక్తులు ఆనంద్‌చారి, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, బస్మేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌గుప్తా, పల్నాటి భాస్కర్, పాల్గొన్నారు.

◆ శ్రీశైలం ఆలయానికి తరలిన శివభక్తులు

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని తుమ్నూర్ గ్రామానికి చెందిన శివభక్తులు శివ మాలాధరణ, ఇరుముడిలతో పాదయాత్రగా శ్రీశైలం ఆలయానికి గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

◆ ఘనంగా బలరాముడి శోభాయాత్ర

సంగారెడ్డి టౌన్: హరే కృష్ణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బలరాముడి శోభాయాత్రను సంగారెడ్డి పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనగర్‌లోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి భవానీ మందిరం మీదుగా శోభాయాత్ర నిర్వహించారు.

◆ నేడు భవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపన

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగంలోని ఓ వెంచర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో భవానీమాత విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం మండపారాధన, అమ్మవారికి జలాధివాసం, దుర్గసూక్త హోమం, గణపతి, నవగ్రహ, రుద్ర హోమం తదితర పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ ఇంటి పన్నులు వసూలు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని పెద్దలోడి, తాటిపల్లి, పిల్లోడి, కంకోల్ తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గురువారం ఇంటి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు.